# వాన జల్లు

వర్షం జోరుగా పడుతోంది. అర్ధరాత్రి హటాత్తుగా ప్రారంభమైన వర్షం ఉదయంనుంచీ తగ్గనేలేదు. పనంతా ముగించుకుని పార్వతి ముందు వసారాలో కూచుంది. టపటపమని పడేవాన చినుకుల రొద ఆమె చెవులకు సంగీతంలా వుంది. వరండాముందు వానకు తడిసిన మల్లెతీగ, జాజి పందిరికి తళతళా మెరుస్తున్నాయి. అవతల మందార మొక్కలు గాలికి ఊగుతున్నాయి.

ఆ వర్షం పార్వతి మనస్సు కెంతో అహ్లాదంగా వుంది. ఎవరూ లేకపోయినా చల్లని ఆ వాన తనకు తోడు నీడలా వుంది. మనస్సులో ఎందుకో తెలియని ఉల్లాసం కలుగుతోంది. తుఫాను వర్షమేమో తగ్గే సూచనలేమీ కనిపించటంలేదు.

ఆ వేళ పనిపిల్లకూడా వర్షం ఎక్కువగా ఉండటంచేత రాలేదు. ఇంట్లో ఇంకెవరూ లేరు. నాన్న వరండా ప్రక్కగదిలో నిద్రపోతున్నాడు. ఈ మధ్య జ్వరం వచ్చి తగ్గినప్పటినుంచి ఆయన ఎక్కువ లేవటంలేదు. అందులో వర్షంగా చలిగా వుంటే అసలే కదలడు. ముసుగు పెట్టి పడు కుంటాడు. ఆయనకూ వయస్సయిపోతోంది. ఆ తోడు కూడా లేకపోతే మరీ ఒంటరి దాన్నయి పోతానేమోనని పార్వతికి తరుచు బెంగ పట్టు కుంటుంది. కాలేజీకి వెళ్ళి ఇంటికి వచ్చేవరకు నాన్న ఎలా ఉన్నాడో, ఏం చేస్తున్నాడో అన్న దిగులే ఉంటోంది. తను వచ్చేవరకు పనిపిల్ల ఇంట్లో ఉంటుంది. మళ్ళా ఆయనకు తను, తనకు ఆయన తోడు. వయస్సు పెరిగి బలం తగ్గేకొద్దీ ఆయనకు తనమీద ప్రేమ ఎక్కువౌతోంది. "అమ్మా

పార్వతీ....అమ్మా పార్వతీ" అని ఆప్యాయంగా పిలుస్తూ తనని ఒక్క క్షణం వదలలేనట్లుంటాడు. తనకు పెళ్ళికాలేదని, తను ఒంటరిదై పోతుందని భయం ఆయనకే లోపల్లోపల వేదిస్తున్నట్లుంది. బలం తగ్గేకొద్దీ ఆయనకు తననుగురించి బెంగ ఎక్కువౌతుంది. తనూ ఆయనను ఒక్క క్షణం వొదల్లేదు. ప్రతిక్షణం ఆయనకేం కావాలో అని ఆయన సంరక్షణ భారమే తన ధ్యేయంగా ఉంటోంది.

వర్షం కొంచెం తగ్గుముఖం పడుతోంది. ఎక్కడా జన సంచారంలేదు. ఎవరో ఒకరిద్దరు దూరంగా చెట్ల క్రింద తలదాచుకున్నారు. ఊరికి దూరంగా నాన్న పెన్షన్ పుచ్చుకున్నాక కొంత దాచుకున్న డబ్బు, కొంత అప్పుచేసి కట్టుకున్న ఇల్లు, రెండు గదులు వరండా మాత్రమే. చుట్టూ కొంత స్థలం, చిన్నతోట వున్నాయి. ఆ వరండాలో కూచుని పార్వతికి ఎంతసేపైనా అలా పూలమొక్కలకేసి, అలా దూరంగా ఉన్న కొండకేసి చూస్తూ వుండాలని వుంటుంది. అప్పుడు ఎందుకో ఒంటరితనమే తెలియదు.

మౌనంగా మనసులో బావ జ్ఞాపకం మెదులుతూ ఉంటుంది. తను బావను పెళ్ళిచేసుకోవాలనుకుంది. అతను ఇష్టపడలేదు! నాన్న తనకు వేరే సంబంధాలు చూశాడు. తను ఇష్టపడలేదు. రోజులు నెలలుగా మారి సంవత్సరాలుగా మారిపోయాయి. బావ తన మనస్సును వదలిపోలేదు. అమాయకంగా, ఆకు కదలినా, బావ వస్తున్నాడేమోనన్న ఆశ కలుగుతుంది సబబు, సందర్భమూ లేని ఊహ. ఎక్కడో దూర దేశాలలో వున్న బావ, ఉత్తరాలకుకూడా జవాబు రాయడు బావ, తనకోసం మళ్ళా వస్తాడని ఏమిటో వెర్రి ఊహ. అక్కడే ఎవరినో పెళ్ళికూడా చేసుకొని సుఖంగా వున్నాడని కూడా ఎవరో చెప్పారు. అది తనకు స్పష్టంగా తెలియదు. అయినా తన మనస్సు అతనినే చుట్టుకు తిరుగుతోంది. ఏ ఆశా లేకపోయినా, అతని నిర్లిప్తత స్పష్టంగా తెలిసినా, మనసు మారటంలేదు, మమకారం చావటం

లేదు. అయితే ఆ మమకారం, ఆ నిరాశా ఎక్కడో, లోపల్లోపల దాక్కున్నాయి. పైకి యాంత్రికంగా నిర్లిప్తంగా జీవితం సాగుతోంది.

గేటు తోసుకు తొందరగా ఎవరో లోపలికి వచ్చారు. రెయిన్‌కోటు తొడుక్కుని ఉన్నాడు. పార్వతి ఎవరోనని తెల్లబోయి లేచి నిలబడింది. అతను పరిచయమున్న మనిషిలా చనువుగా మాట్లాడాడు. "రామకృష్ణయ్య గారిల్లు ఎక్కడో చెప్పగలరా. వర్షం తగ్గిందిగదా అని బయలుదేరాను. మళ్ళీ ఎక్కువైంది" అన్నాడు. పార్వతి ఎదురుగా దూరంగాఉన్న ఇల్లు చూపించి "అదే" అన్నది. అతను వెళ్ళలేదు. ఒక్క అడుగు ముందుకు వరండాలోకివచ్చి చాలా దగ్గర బంధువులా అన్నాడు నవ్వుతో. "నేను సునంద తండ్రిని. మీరు గుర్తుపట్టినట్లు లేదు." సునంద ఎవరో పార్వతికి వచ్చినా గుర్తుకు రాలేదు. ఎప్పుడో తన దగ్గర చదువుకున్న విద్యార్థిని అయివుంటుంది. ఏ సంవత్సరం చదివిందో ? ఏం చదివిందో, ఆమె ముఖం ఎలా ఉంటుందో ఏమీ స్ఫురణకు రావటంలేదు. "అలాగా" రండి కూర్చోండి" అంది పైకి మర్యాదగా.

అతను కూర్చోలేదు. "మా సునందకు మీరంటే చాలా అభిమానం" అన్నాడు ఆయన సంతోషంగా. తన కూతురు పార్వతి విద్యార్థిని కావడంచేత తమకిద్దరికి ఏదో సన్నిహిత బంధుత్వం ఉన్నట్లుగా పార్వతి సిగ్గుపడుతూ నవ్వింది. ఆ సునంద ముఖం గుర్తుకు రాకపోయినా "ఇప్పుడు సునంద ఏమి చేస్తోంది" అన్నది ఆప్యాయంగా.... "పెళ్ళయింది.... అమెరికాలో ఉంది" అన్నాడు గర్వంగా. బావకూడ అమెరికాలోనే ఉన్నాడుగదా. ఇప్పుడు నిజంగా పార్వతికి ఆయనతో బంధుత్వ మేర్పడి నట్లనిపించింది.

వర్షం తగ్గుతోంది. వస్తాను అన్నాడతను.

"సునందను అడిగానని చెప్పండి" అంది ఆమె. అతను వెళ్ళిపోయాడు.

వర్షం ధారగా పడుతోంది. పార్వతికి మనస్సు సంతోషంగా ఉంది. లోపల్లోపల్నుంచి ఏదో ఉల్లాసం కలుగుతోంది. కారణంలేని ఆనందం అది వర్షపు చల్లదనం. ఏదో వ్రాయాలనిపిస్తోంది. తను ఒంటరిది కాదు ఈ వానజల్లు, ఈ లేత మొక్కలు తనకు తోడునీడ. సునంద తండ్రివంటి వారు ఎందరో తనకు బంధువులు. ఆమె ముఖం ఆనందంతో వికసించింది "అమ్మా, పార్వతీ" నాన్న పిలుస్తున్నాడు.

పార్వతీ నవ్వుతో వెళ్ళింది.